వెన్నుపోటు చంద్రబాబు పేటెంట్



మీడియాతో మాట్లాడుతున్న అదీప్‌రాజ్

- సూపర్ సిక్స్ పథకాల పేరిట ప్రజలను దారుణంగా వంచించారు
- ప్రజల దృష్టి మళ్లించేందుకే దాడులు, హత్యలు, అక్రమ కేసులు
- పెందుర్తిలో భారీగా ప్రభుత్వ స్థలాల కబ్జా
- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అదీప్‌రాజ్ ధ్వజం
- పెందుర్తిలో వెన్నుపోటు దినం నిరసనకు భారీ స్పందన



'వెన్నుపోటు దినం' నిరసన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ నేతలు



తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న అదీప్‌రాజ్, పార్టీ నేతలు

పెందుర్తి: సరిగ్గా ఏడాది క్రితం సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను పూర్తిగా వంచించిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆరోపించారు. ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తరువాత వారికి వెన్నుపోటు పొడవడం సీఎం చంద్రబాబు తనకు పేటెంట్ హక్కుగా భావిస్తారని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏడాది పూర్తి అయినా అమలు చేయకుండా మోసం చేసినందుకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో రాంపురం నుంచి పెందుర్తి వేంకటేశ్వరస్వామి ఆలయ రోడ్డు మార్గం వరకు వాహనాల్లో తరలి వచ్చారు. అక్కడి నుంచి ప్లకార్డులు చేతబూని 'డౌన్ డౌన్ సీఎం.. డౌన్ డౌన్ డీసీఎం'అంటూ నినాదాలు చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర చేశారు. ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు.

ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీలు తక్షణమే అమలు చేస్తామని ఓట్లడిగిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇప్పుడు ఖజానాలో డబ్బుల్లేవని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే వేలాది కోట్లు అప్పులు చేసినా ఆ సొమ్మును దేనికి ఖర్చు చేశారో చెప్పలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. డబ్బులు లేవని చెబుతూనే ప్రజల సొమ్ముతో సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్‌ల కోసం ప్రత్యేక హెలికాప్టర్లు ఏర్పాటు చేసుకున్నారని మండిపడ్డారు. లోకేష్ మంత్రిగా ఉన్న విద్యాశాఖ ఏడాది కాలంలోనే భ్రష్టుపట్టిపోయిందన్నారు. ఈ ఏడాది పదోతరగతి విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారని, అయినా లోకేష్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవడానికి చంద్రబాబు సిద్ధంగా లేరని విమర్శించారు. పదో తరగతి మార్కుల విషయంలో ఇంత గందరగోళాన్ని సృష్టించిన లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెడితే వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులను తరిమి కొట్టాలని పిలుపునిచ్చిన లోకేష్.. ఇప్పుడు అదే పనిచేస్తున్నారని, లోకేష్‌ను ఇప్పుడేం చేయాలని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి ఇసుక, మద్యం, మైనింగ్‌లలో ఇష్టానుసారం దోచుకుంటున్నారని ఆరోపించారు. సూపర్ సిక్స్ హామీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు పెడుతూ, ఏకంగా పోలీసులతోనే నడిరోడ్డుపై దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. కూటమి నాయకుల దోపిడీకి అడ్డు వస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులను తీవ్రంగా వేధిస్తున్నారని ధ్వజమెత్తారు.

పెందుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కబ్జాదారులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో చినముషిడివాడ సర్వే నెంబర్ 113లోని ప్రభుత్వ స్థలంలో ఆక్రమణను అడ్డుకుని, హెచ్చరిక బోర్డు పెట్టిస్తే ఇప్పుడు అదే స్థలంలో ఎమ్మెల్యే అండతో అక్రమ నిర్మాణం జరుగుతోందన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే నియోజకవర్గంలో కూటమి నాయకుల కబ్జాలకు, అక్రమ మైనింగ్‌కు, అవినీతికి అంతులేకుండా పోతోందని ధ్వజమెత్తారు. ప్రజలను అన్ని రకాలా వంచించి తిరిగి ఏడాది పాలనలో ఏదో చేశామని మభ్యపెట్టేలా 'సంక్రాంతి, దీపావళి'చేసుకోవడానికి కూటమి ప్రభుత్వానికి, నాయకులకు సిగ్గుండాలని మండిపడ్డారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు సూపర్ సిక్స్ హామీలు తక్షణమే అమలు చేయాలని, లేదంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్, సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, పరవాడ జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు మోపాడ అప్పారావు, కొయిలాడ శ్రీను, వడ్డాది అప్పలరాజు, వెన్నెల అప్పారావు, బంధం నాగేశ్వరావు, బుస అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యులు బోకం బాలు, గొల్లవిల్లి శ్రీను, పార్టీ సీనియర్ నేతలు చుక్కా రామునాయుడు, మధుపాడ అంజి, ఉప్పిలి కనకరాజు, బోకం రామునాయుడు, కొటాన రాము, పాలిశెట్టి సురేష్‌రాజ్, చొప్ప నాగరాజు, యతిరాజుల నాగేశ్వరరావు, అప్పికొండ మహాలక్ష్మినాయుడు, బొడ్డు సూర్యప్రకాష్, బల్ల రాంబాబు, నదియా, మెంటి మహేష్, దాడి ఉమామహేష్, గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, బొడ్డు ప్రకాష్, కూండ్రపు సీతారామయ్య, తామర్ల నర్సింగ్, దాసరి సత్తిబాబు, పెదిశెట్టి శేఖర్, కోన రామారావు, గొర్లి గోపి, పల్లా అప్పారావు, బోని నాయుడు, బొడ్డపల్లి హేమంత్‌కుమార్, బట్టు పైడిరెడ్డి, ఎంపీ రెడ్డి, రాపేటి రాము, ఉగ్గిన నాయుడు, బండారు శ్రీను, బోకం శ్రావణ్‌కుమార్, దిలీప్, కోన శ్రీనివాసరావు, కృష్ణ, గొంప అప్పారావు, కొమ్మ కనకరాజు, బుదిరెడ్ల రామకృష్ణ, ఉగ్గిన నాగార్జున, సబ్బవరపు నాగభూషణ్, అవగడ్డ శ్రీనివాస్, సిరపరపు వాసు, ఐడీ బాబు, మండా గౌరీలక్ష్మి, విజయలక్ష్మి, వందలాదిగా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

'మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలుచేయాలి'



దేశపాత్రునిపాలెం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జెండాను ఆవిష్కరిస్తున్న పరమేశ్వరి

పరవాడ: మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని తక్షణమే అమల్లోకి తీసుకురావాలని మహిళా సమాఖ్య అనకాపల్లి జిల్లా కార్యదర్శి బూసి పరమేశ్వరి డిమాండ్ చేశారు. జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దేశపాత్రునిపాలెం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జెండాను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం పరమేశ్వరి మాట్లాడుతూ మహిళలు ఎంత ఎదిగినా అడుగడుగునా అవమానాలు తప్పట్లేదన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో టెర్రరిస్టుల వెన్నులో వణుకు పుట్టించేలా నాయకత్వం వహించిన కల్నల్ సోఫియా ఖురేషి, వ్యోమికాసింగ్‌ల కులాలను, మతాలను అడ్డంపెట్టి అధికార పార్టీ బీజేపీ ఎంపీలే అవమానించడం దేశ ద్రోహం కంటే తీవ్రమైన నేరమన్నారు. అవమానించిన వారిపై కేసులు పెట్టి, మహిళల గౌరవాన్ని, దేశ ప్రతిష్టను కాపాడాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం, ఉచిత బస్సు, 45 ఏళ్లు నిండిన వారికి ఆర్థిక సాయం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కె.లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గుడాల లక్ష్మి, నారాయణమ్మ, కింజిరి రమ్య, బి.అరుణ, కె.వర తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పరిశీలించి న్యాయం చేయండి



ఆర్డీవో శ్రీలేఖకు సమస్యలు వివరిస్తున్న రైతులు, లేఅవుట్ ప్లాట్ల యజమానులు

పెందుర్తి: గోపాలపట్నం, నార్త్ సింహచలం రైల్వే స్టేషన్ నుంచి లక్ష్మీపురం వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గొడౌన్ వరకు అదనపు రైల్వే ట్రాక్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు/ప్లాట్ల యజమానులకు తగిన న్యాయం చేయాలని ఆయా సంఘాల ప్రతినిధులు ఆర్డీవో శ్రీలేఖను కోరారు. అదనపు ట్రాక్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారికి పరిహారం విషయంలో తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు బుధవారం పార్లుపాలెంలో నిర్వహించిన గ్రామ సభలో ఆర్డీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిహారం విషయంలో వివాదం నడుస్తున్న సాగులో ఉన్న రైతులు, ప్లాట్ల యజమానుల అభిప్రాయాలను తీసుకుని రికార్డులను పరిశీలించారు. రైతులు, ప్లాట్ల యజమానుల హక్కులను పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని ఆర్డీవో ఈ సందర్భంగా తెలిపారు. తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్, రైల్వే అధికారి శ్రీధర్, ఆర్ఐ దివ్య, పార్లుపాలెం, చింతలగ్రహారం, చీమలాపల్లి గ్రామాలకు చెందిన రైతులు, ఇక్కడి లేఅవుట్ ప్లాట్ల యజమానులు పాల్గొన్నారు.

'ఓటు హక్కుపై అవగాహన కలిగించండి'



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో శేషశైలజ

పెందుర్తి: సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై యువతకు అవగాహన కలిగించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్వో) పి.శేషశైలజ సూచించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నియోజకవర్గ ఓటర్ల జాబితాపై రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు అర్హత కలిగిన ప్రతి ఒక్కరితో ఓటు నమోదు చేయించాలన్నారు. ఓటు హక్కు నమోదు నిరంతర ప్రకియ అని పేర్కొన్నారు. తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

భీమిలికి తరలివెళ్లిన 98వ వార్డు వైఎస్సార్‌సీపీ శ్రేణులు



అడవివరం నుంచి భీమిలి బయల్దేరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సింహాచలం: ఏడాది కూటమి పాలనా వైఫల్యాలను, వెన్నుపోటు రాజకీయాల తీరుని ఎండగడుతూ బుధవారం భీమిలిలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి 98వ వార్డు అడవివరం నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు ఆధ్వర్యంలో వీరంతా జై జగన్.. జైజై జగన్ నినాదాలు చేస్తూ అక్కడి చేరుకున్నారు. ఈ సందర్భంగా కొలుసు ఈశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చలేదన్నారు. వార్డు మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వార్డు యువజన విభాగం అధ్యక్షుడు బోర మోహన్‌రెడ్డి, నాయకులు లంక సత్తిబాబు, దమ్ము ఎర్రాజీరావు, బోర కృష్ణారెడ్డి, సిరిపురపు కృష్ణ, బొట్టా శ్రీను, శిడగం తాతబాబు, బోర లక్ష్మణరెడ్డి, ఎస్.అప్పారావు, కిషోర్, బోర ప్రసాదరెడ్డి, ఆదిరెడ్డి, దిలీప్‌రెడ్డి, మజ్జి వెంకటరమణ, మహంతి ప్రసాద్, తదితరులు భీమిలి వెళ్లిన వారిలో ఉన్నారు.

నులి పురుగుల నివారణ మందు పంపిణీ



నులి పురుగుల నివారణ మందు తీసుకుంటున్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు నీతి కథలను బోధించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. ఇంగ్లిష్‌లో మెళకువలు నేర్పించారు. పలు ఆటలు ఆడించారు. ధ్యానంలో శిక్షణ ఇచ్చారు. పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్ విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందును ఉచితంగా అందించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబులుకు ఘన నివాళి



ఎస్ఆర్ పురంలో గొరపల్లి బాబులు చితి వద్ద నివాళులర్పిస్తున్న అదీప్‌రాజ్

పెందుర్తి: గుండెపోటుతో బుధవారం మృతి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గొరపల్లి బాబులుకు మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఘనంగా నివాళి అర్పించారు. మండలంలోని ఎస్ఆర్ పురం పంచాయతీ కేదారివానిపాలెంలో బాబులు నివాసానికి వెళ్లి, మృతదేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. బాబులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ బాబులు మరణం పార్టీకి తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ పరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ సీనియర్ నాయకులు మధుపాడ అంజి, బొడ్డు సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



జీలకర్ర బెల్లం ఘట్టంలో అర్చకులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

విశేషంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం ఈ సేవని నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతి అందించారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

అసాంఘిక కార్యకలాపాలపై కేసుల నమోదు



మేహాద్రి సమీపంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న వ్యక్తులను డ్రోన్ సాయంతో పట్టుకున్న పోలీసులు

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న పలువురిపై పోలీసులు బుధవారం కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, మద్యపానంతో పాటు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్న సమాచారంతో పెందుర్తి, సుజాతనగర్, పురుషోత్తపురం, నాయుడుతోట, వేపగుంట ప్రాంతాల్లో సీఐ కె.వి.సతీష్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్ చిత్రాల ఆధారంగా నిందితులను గుర్తించారు. ప్రమాదకరంగా ఈత కొడుతున్న యువకులను కౌన్సెలింగ్ ఇచ్చి, అక్కడి నుంచి పంపేశారు. ఈ క్రమంలో మద్యం సేవిస్తున్న మొత్తం 39 మందిపై, ధూమపానం చేస్తున్న 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతో పాటు బహిరంగంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉగ్రవాదాన్ని నిర్మూలించాలి



పరవాడ గొల్లగుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పరవాడ: అమాయకులను అత్యంత కిరాతకంగా హతమార్చిన పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రమూక, దానికి సహకారం అందించిన పాకిస్తాన్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో అశువులు బాసిన 28 మంది ఆత్మలకు శాంతి చేకూరాలని, ఉగ్రదాడిని ఖండిస్తూ పరవాడ మండలం గొల్లగుంటలో బుధవారం సమైక్యతా యాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భారత్ ఎదుగుదలను తట్టుకోలేకే పాకిస్తాన్ ఉగ్రవాదులను మన దేశం మీదకు ఉసిగొల్పుతోందని ఆరోపించారు. పహల్గాం దాడికి ప్రతీకార చర్యగా భారత సైనికులు పాక్ ఉగ్రస్థావరాలపై దాడులు చేసిన తీరును కొనియాడారు. భారత సైనికులకు సెల్యూట్ పలికారు. ఘటన అనంతరం దేశంలో మత గొడవలు రెచ్చగొట్టే శక్తులు విష ప్రచారం చేస్తున్నా కేంద్రం ప్రభుత్వం దాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, షకీలా, మనీషా, ఆలీ పాల్గొన్నారు.

రాయితీపై పంపిణీకి పచ్చిరొట్ట విత్తనాలు

సబ్బవరం: ఖరీఫ్ ప్రారంభం కానుండటంతో మండలంలోని రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. మండలంలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 3,395 ఎకరాలు ఉండగా అందుకు అనుగుణంగా 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉంచామన్నారు. జీలుగ 4 క్వింటాళ్లు, జనుము 11, పిల్లిపెసర 6, మిక్స్‌డ్ విత్తనాలు 1 క్వింటా అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. వీటిని రైతు సేవా కేంద్రాల్లో రాయితీ పోనూ జీలుక కిలో రూ.61.50, జనుము రూ.54.50, పిల్లిపెసర రూ.90కి అందిస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.